క్లుప్తంగా

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ


భూమి పూజ చేస్తున్న దృశ్యం

గోస్పాడు: మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో శ్రీఅభయాంజనేయ స్వామి విగ్రహ ఏర్పాటుకు బుధవారం శంకుస్థాపన, భూమిపూజ నిర్వహించారు. దేవాలయ నిర్మాణం చేపట్టేందుకు నంద్యాల గురురాజా విద్యాసంస్థల అధినేత దస్తగిరి రెడ్డి స్థలాన్ని విరాళంగా ఇచ్చారని నిర్వాహకులు తెలిపారు. గ్రామస్తులు ఐక్యంగా విరాళాలు అందించడంతో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వేదపండితులు రామశేషఫణి శర్మ, గౌతం శర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యహవాచనం, ప్రధాన కలశపూజ, శంఖు యంత్రాభిషేకం, వాస్తు పూజ, శంఖు ప్రతిష్ఠాపన వంటి పూజా కార్యక్రమాలు చేపట్టారు.

శబరిమలకు బయలుదేరిన భక్తులు


ఇరుముడి స్వీకరిస్తున్న అయ్యప్ప మాలధారులు

దొర్నిపాడు: మండలకేంద్రం నుంచి సుమారు 40 మంది అయ్యప్ప మాలధారులు బుధవారం ఇరుముడితో శబరిమలకు బయలు దేరారు. స్థానిక కోర్టు ఆవరణలో ప్రత్యేక పూజలు అనంతరం వారు ఇరుముడి స్వీకరించి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యే పూజలు చేశారు. అనంతరం శబిరిమలకు బయలుదేరారు.

ఈవీఎంల నిర్వహణపై శిక్షణ


బీఎల్ఓలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

దొర్నిపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ జయప్రసాద్ ఈవీఎంల నిర్వహణపై బీఎల్ఓలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించారు. అనంతరం ఓటరు నివేదికను ఎలాంటి పొరపాట్లు లేకుండా తయారు చేయాలని సూచించారు. నూతన ఓటర్లు ఉంటే వారి నుంచి దరఖాస్తులు తీసుకోవాలని చెప్పారు. ఎన్నికల డీటీ శేఖర్ ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


లిఖిత

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన జెడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు రాజగోపాల్ రెడ్డి కుమార్తె లిఖిత రెడ్డి జాతీయస్థాయి సీనియర్స్ కారమ్స్ పోటీలకు ఎంపికై ందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 10 - 13 వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సీనియర్ కారమ్స్ కప్ పోటీల్లో పాల్గొననుందని చెప్పారు. ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోండి


వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పదవ తరగతి పరీక్ష ఫీజును ప్రభుత్వం నిర్దేశించిన దానికంటే అధికంగా వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు రఫీ, అనంద్ కోరారు. ఈ మేరకు బుధవారం అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఫీజు రూ.125 ఉండగా.. ఆయా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు రూ.1500 నుంచి రూ.2000 వేల వరకు వసూలు చేస్తున్నాయని చర్యలు తీసుకోవాలని కోరారు. అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రత్యే కమిటీ వేసి విచారించి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

మహానంది: పాడి పశువుల ఆరోగ్యం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం తమ్మడపల్లె రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులకు పలు అంశాలపై సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాడి పశువులకు హెల్త్ కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. వీటి ద్వారా పాడి పశువుల ఆరోగ్యం కోసం ఎప్పటికప్పుడు సరైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవచ్చన్నారు. వీఎల్ఓ సులోచన ఆధ్వర్యంలో రైతుల పాడి పశువులకు హెల్త్ కార్డులు పంపిణీ చేశారు.

ధాన్యం తడవకుండా ఇంటికి చేర్చా



వరి పంట కోత దశలో ఉండగా తుఫాన్ ప్రభావం ఉందని గ్రామ వలంటీరు నరేంద్రబాబు ముందుగానే సమాచారం ఇవ్వడంతో 5 ఎకరాల్లోని పంటను మిషన్ సహాయంతో నూర్పిడి చేసి దిగుబడిని వెంటనే ఇంటికి తరలించానని చాగలమర్రి మండలం, ముత్యాలపాడు గ్రామంలోని పోస్టాఫీసు వీధికి చెందిన రైతు వరికూటి సుబ్బరాయుడు సంతోషం వ్యక్తం చేశాడు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీరు వ్యవస్థ ప్రవేశ పెట్టడంతో ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని చెప్పాడు. వలంటీర్ ముందస్తు సమాచారం మేరకు తనకు సుమారు రూ.2.50 లక్షలు నష్టపోలేదని పేర్కొన్నాడు.

ముప్పు తప్పించారు

- మిచాంగ్ ముప్పుపై రైతులను అప్రమత్తం చేసిన వలంటీర్లు
- ప్రభుత్వ ఆదేశాలతో నిత్యం అందుబాటులో గ్రామ వలంటీర్లు
- కోత కోసిన పంటలు తడవకుండా చర్యలపై అవగాహన
- జాగ్రత్త పడిన అన్నదాతలు


ముత్యాలపాడు వద్ద నేల వాలిన వరి పైరు


కోతకు వచ్చిన వరి పంట


గుండంపాడు వద్ద కల్లంలో వరి ధాన్యంను తిప్పేస్తున్న కూలీలు

శిరివెళ్ల: మండలంలో ఈ ఖరీఫ్‌లో వరి, మినుము పంటలు అధికంగా సాగయ్యాయి. 6 వేల ఎకరాలలో వరి, 2,345 ఎకరాల్లో మినుమ పంట వేశారు. ప్రస్తుతం అవి కోత దశలో ఉన్నాయి. వరిలో దాదాపు 2,456 ఎకరాలు పూర్తిగా కోతకు వచ్చింది. కోతకు సిద్ధమవుతున్న తరుణంలో మిచాంగ్ తుఫాన్ ప్రభావం చూపనుందని ప్రభుత్వ హెచ్చరికల నేపథ్యంలో కనపడింది. అధికారుల సూచన మేరకు గ్రామ వలంటీర్లు రైతులు నష్టపోకుండా అప్రమత్తం చేశారు. తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి తుఫాన్‌పై అన్నదాతలకు సమాచారమిచ్చారు. దీంతో వారు పంట కోతలను వాయిదా వేసుకున్నారు.

చాగలమర్రి: మండలంలో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కోత దశలో ఉన్న జొన్న, వరి, మినుము, మిరప పంటలు నేలకొరిగాయి. ముత్యాలపాడు, నేలంపాడు, డి.వనిపెంట, డి.కొత్తపల్లె గ్రామాల్లో కోత దశలో ఉన్న సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వరి పంట నేలపాలైంది. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురిసినా అనుకూల వాతావరణం ఉండటంతో పంట సమృద్ధిగా పండింది. దిగుబడి ఆశించిన స్థాయిలో వస్తుండటం, ధర కూడా 75 కేజీల బస్తా రూ.2,200 ప్రకారం కొనుగోలు చేస్తుండటంతో రైతులు సంతోషంలో ఉన్నారు. ఈ సమయంలో వర్షం కురవడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. మండలంలో సోమవారం సుమారు 14 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, ఈదర గాలులకు ముత్యాలపాడులో జొన్న పంట నేల వాలగా, నేలంపాడులో నాగేశ్వరరావు అనే రైతుకు చెందిన 10 ఎకరాల వరి, 3 ఎకరాల పచ్చిమిర్చి, 3 ఎకరాలలో మినుము, ముత్యాలపాడులో శేషరమేష్ అనే రైతుకు చెందిన 10 ఎకరాల జొన్న నేలపాలయ్యాయి. అలాగే.. ముత్యాలపాడు, గొడిగనూరు తదితర గ్రామాల్లో సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో కోత దశలోనున్న జొన్న పంట నేలకొరిగి తీవ్ర నష్టం వాటిల్లింది. అయితే వరి కోతలకు సిద్ధమవుతున్న రైతులను ఆయా గ్రామాల వలంటీర్లు తుఫాన్ హెచ్చరికలపై అప్రమత్తం చేసి కోతలను వాయిదా వేసుకునేలా చేశారు. అలాగే కోత కోసి కళ్లాల్లో ఆరబోసుకున్న వారిని పట్టలు కప్పుకునేలా సూచించారు.

వరి కోత వాయిదా వేశా



ఖరీఫ్‌లో 10 ఎకరాలు వరి, 6 ఎకరాలలో మినుము పంటలు వేశా. మంగళవారం పంట కోయాలని ఏర్పాటు చేసుకుంటుండగా సోమవారం సాయంత్రం మా వలంటీర్ జాకోబు వచ్చి తుఫాన్ గురించి వివరించి పంట కోత వాయిదా వేసుకోవాలని చెప్పాడు. దీంతో తుఫాన్ ప్రభావం తగ్గిన తరువాత కోద్దామని వాయిదా వేసుకున్నా. ఒక వేళ సమాచారం లేకపోయి ఉంటే పంట కోసి వర్షానికి ఇబ్బందులు పడాల్సి వచ్చేది.

– శ్రీనివాసులరెడ్డి, రైతు, గుండంపాడు

34 మంది రైతులను అప్రమత్తం చేశా



నాకు 50 ఇళ్లు కేటాయించారు. అందులో 34 మంది రైతులున్నారు. వరి, మినుము పంట వేశారు. పంటలు కోయడానికి సిద్ధమవుతున్నారని తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి తుఫాన్ ముంచుకొస్తుందని, కోతలు కోస్తే దిగుబడి నష్టపోయే ప్రమాదముందని, వెంటనే వాయిదా వేసుకోవాలని చెప్పా. దీంతో వారు కోతలు వాయిదా వేసుకున్నారు. ప్రస్తుతం వారికి నష్టమేమీ జరగలేదు.

– ప్రహ్లాదుడు, వలంటీర్, ఇసుకపల్లె

పంటలు నష్టపోకుండా చూశాం



నాకు కేటాయంచి 50 కుటుంబాలన్నీ రైతులే. మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు సూచించడంతో నా పరిధిలోని రైతులను అప్రమత్తం చేశా. దీంతో పంట కోతలు నిలిపివేశారు. వరి, మిను ము పంటలు దెబ్బతినలేదు.

– బాలగుర్రప్ప, వలంటీర్

పిల్లలను ఉన్నత చదువులు చదివించాలి


తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరిస్తున్న తెలుగుగంగ ప్రాజెక్టు ఎస్‌ఈ

దొర్నిపాడు: ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం సర్కారు బడులను అన్ని వసతులతో తీర్చిదిద్దందని తమ పిల్లలను తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదివించాలని మండల ప్రత్యేక అధికారి, తెలుగు గంగ ప్రాజెక్టు ఎస్‌ఈ వెంకటరమణయ్య సూచించారు. బుధవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో ఆయన జీఈఆర్ (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో) సర్వేపై ఇంటింటా తిరిగి తల్లిదండ్రుల నుంచి పిల్లల వివరాలను తీసుకున్నారు. ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఎంఈఓ రామచంద్రయ్య, సర్పంచ్ శివరామిరెడ్డి, సీఆర్‌పీ శివకుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ గీత పాల్గొన్నారు.

పిల్లలు బడిలో ఉండాలి

రుద్రవరం: బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని, పనిలో కాదని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి సూచించారు. బుధవారం జీఈఆర్ సర్వేలో భాగంగా ఆయన మండలంలోని హరినగరం గ్రామంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే గుడ్లను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ లక్ష్మి ఉన్నారు.

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు సహకరించండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శామూన్, జేసీ రాహుల్, డీఆర్‌ఓ

నంద్యాల: ఓటర్ల జాబితాలో నమోదు, సవరణలకు సంబంధించి క్లెయిమ్స్, అభ్యంతరాలను ఈ నెల 9వ తేదీ వరకు స్వీకరిస్తామని ఇందుకు రాజకీయ పార్టీలు ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు సహకరించాలని జిల్లా కలెక్టర్ మనజిర్ జిలానీ శామూన్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ప్రత్యేక ఓటర్ల సవరణ – 2024, క్లెయిమ్స్, అభ్యంతరాలు తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జేసీ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ పుల్లయ్య తదితరులతో కలిసి కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు దరఖాస్తులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి ఓటర్ల జాబితాలో పొందుపరిచి జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 34,912 అన్ని రకాల ఫారమ్స్ పెండింగులో ఉన్నాయని వీటిని పరిశీలించి జాబితాలో నమోదు చేస్తామని చెప్పారు. అన్ని నియోజకవర్గాల్లో ప్రతి వారం ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 2,3 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా 10,800 దరఖాస్తులు స్వీకరించామని, ఎన్నికల సంఘం సూచించిన సాఫ్ట్‌వేర్ ద్వారా ఫొటో మిస్ మ్యాచింగ్ చిరునామా తదితర అంశాలను పరిశీలించి సరిచేస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో విచారణలో అన్ని రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను పంపించాలని సూచించారు. జిల్లాకు 30 వేల ఎపిక్ కార్డ్స్ వచ్చాయని, ఇంకా 90,000 ఎపిక్ కార్డ్స్ రావాల్సి ఉందన్నారు. ఎన్నికల సమాచారం కొరకు కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఓటరు నమోదు పట్ల అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు జాకీర్ హుసేన్, కాంగ్రెస్ నుంచి సయ్యద్ రియాజ్ బాషా, టీడీపీ నుంచి శివరామిరెడ్డి, మధు సుధాకర్ పాల్గొన్నారు.



నంద్యాలలోని 6వ వార్డులో డిజిటల్ బోర్డును, 24వ వార్డులో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

సంక్షేమాభివృద్ధిని వివరిస్తున్నాం


35వ వార్డులో మాట్లాడుతున్న కౌన్సిలర్ బషీద్

నంద్యాల (సిటీ): నాలుగున్నర ఏళ్లలో ప్రజలకు చేసిన అభివృద్ధిని వివరిస్తున్నామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాసు అన్నారు. బుధవారం పట్టణంలోని 6వ వార్డు, 24వ వార్డు, ఊడుమాలపురం సచివాలయం పరిధిలో వార్డుకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. 24వ వార్డులో కౌన్సిలర్ షహనాజ్, వార్డు ఇన్‌చార్జ్ రహంతుల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంక్షేమ ఫలాలకు సంభందించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. వార్డులో రూ.21.83 కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. సన్నాల సాయిరాం రెడ్డి, జాకీర్ హుసేన్ తదితులున్నారు.35వ వార్డులో కౌన్సిలర్ బషీద్ ఆధ్వర్యంలో వార్డులో రూ.15.29కోట్లతో చేపట్టిన సంక్షేమాభివృద్ధి డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. ఊడుమాలపురంలో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జులు బొమ్మ తిక్కారెడ్డి, విజయభాస్కరరెడ్డి, పుల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డిల ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమంన్ని నిర్వహించారు.

నిధుల మంజూరు

శిరివెళ్ల: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు నాడు– నేడు రెండో దశ కింద నిధులు మంజూరయ్యాయని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. ఇసుకపల్లెకు రూ.1.70 లక్షలు, చెన్నూరుకు రూ.31.50 లక్షలు, బోయలకుంట్ల రూ.1.20 లక్షలు, కోటపాడుకు రూ.1.63 లక్షలు , వనికినిదిన్నెలోని కేంద్రానికి రూ. 1.46 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. వీటితో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయం, రంగులు వేయడానికి వినియోగిస్తారని పేర్కొన్నారు.

బిల్లులు సకాలంలో వసూలు చేయాలి

గోస్పాడు: వినియోగదారుల నుంచి విద్యుత్ బిల్లులు సకాలంలో వసూలు చేయాలని ఏఈ జ్ఞానసూర్యుడు తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. బిల్లుల చెల్లింపుపై అవగాహన వినియోగదారులకు కల్పించి త్వరితగతిన చెల్లించేలా చూడాలన్నారు. ఎక్కడైనా మీటరు లేకుండా విద్యుత్‌ను వినియోగిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ ఆనందరావు ఉన్నారు.

సమయపాలన పాటించాలి

గోస్పాడు: గ్రామ సచివాలయాల సిబ్బంది సమయ పాలన పాటించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనసూయ తెలిపా. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో సేవలు అందించాలని, పథకాలపై అవగాహన కల్పించి అర్హులకు అందేలా చూడాలని చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలి

చాగలమర్రి: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు కోరారు. బుధవారం స్థానిక కేరళ ఆసుపత్రి వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. తమ డిమాండ్లను పరిష్కరించాలని ఈనెల 8వ తేదీ నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెను నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చంద్రకళ, మండల అధ్యక్షురాలు వాహిద, పద్మావతి, నాగమణి, రజిని, సంజీవమ్మ, రెహెనా, గుర్రమ్మ, సుజాత, ఇందుమతి పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం


గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండల కేంద్రంలో బుధవారం అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి మాలధారులు, భక్తులు ప్రధాన వీధుల్లో నిర్వహించిన గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

పారదర్శక పాలన జగనన్నతోనే సాధ్యం


గుండంపాడులో పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే


మృతుడి భార్యకు వైఎస్సార్ బీమా చెక్కు అందచేస్తున్న దృశ్యం

శిరివెళ్ల: అర్హులందరికీ పథకాలు వర్తింపజేసి, అందుకు సంబంధించిన సొమ్మును నేరుగా లబ్ధిదారుల్లో జమ చేసి పారదర్శక పాలన సాగిస్తున్నారని, ఇలా సిఫార్సు రహిత, అవినీతి రహిత ప్రభుత్వం జగనన్నతోనే సాధ్యమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గుండంపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలతో సిఫార్సులు, లంచాలు, అనర్హులకు వర్తింపేజేశారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం కేవలం అర్హులై ఉంటే చాలని చెప్పారు. జగనన్న పాలనలో టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకులకు కూడా పథకాలు అందాయన్నారు. అనంతరం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దానమయ్య భార్య కృపావతికి వైఎస్సార్ బీమా కింద మంజూరైన రూ.5 లక్షల చెక్కును అందజేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ దిల్దార్ నాయక్, ఎంపీపీ నాయక్ వసీం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, ఎంపీటీసీ శ్రీనివాసులరెడ్డి, సర్వ నరసింహస్వామి ఆలయ చైర్మన్ రామాంజనేయరెడ్డి, నాయకులు, రవికుమార్, ప్రకాశం, దండె ప్రతాపరెడ్డి, దేవస్థానం చైర్మన్ శివరామిరెడ్డి, మార్కెట్ యార్డ్ వైఎస్ చైర్మన్ నరహరి, బోయలకుంట్ల సర్పంచు జింకల నాగన్న, మహదేవపురం సర్పంచు పెద్ది రమణయ్య, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ పాల్గొన్నారు.

నేటి నుంచి విళక్కి పూజలు

నంద్యాల(వ్యవసాయం):స్థానిక గుడిపాటి గడ్డలో వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో 44వ మండల విళక్కి మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టిశ్రీధర్, గురుస్వామి లక్ష్మయ్య తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. 7న సాయంత్రం గోపూజ, గంగ పూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం అంకురార్పాణ, ధ్వజారోహణ కార్యక్రమాలుంటాయన్నారు. 8న ఉదయం లక్ష్మి గణపతి, అయ్యప్ప, నవగ్రహ, రాజశ్యామల హోమాలు నిర్వహించి మహాపూర్ణాహుతి గావిస్తారన్నారు. అదే రోజు సాయంత్రం ఆయుధ పూజ, జ్యోతి ప్రజ్వలన,మూల విరాట్‌కు పుష్పయాగం ఉంటుందని చెప్పారు. శనివారం ఉదయం కన్య స్వాములతో సింగారి మేల వాయిద్యాలతో చిన్న చెరువు నుంచి జాలలను ఊరేగింపుగా తెచ్చి స్వామివారిని అభిషేకిస్తామన్నారు. చివరగా...సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తిని పుర వీధుల్లో గ్రామోత్సవం, అష్టాదశ కళశాన్వితక పడిపూజ నిర్వహించి ఊంజల్ సేవ మహామంగళ హారతి, హరివరాసనంతో కార్యక్రమాలు ముగుస్తాయని వివరించారు.

కులగణనకు సహకరించాలి


మాట్లాడుతున్న చింతామణి

ఉయ్యాలవాడ : కుల గణనకు ప్రజల అనుమానాలు నివృతి చేసేందుకు ప్రజా ప్రతినిధుల సహకారం ఎంతో అవసరమని జిల్లా సాంఘిక సంక్షేమాధికారిణి చింతామణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన కుల గణనపై ప్రజా ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ నుంచి కులగణన ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు గ్రామంలో ఇంటింటికీ తిరిగి కార్యక్రమం చేపట్టనున్నారని చెప్పారు. జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మీదేవి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోండి

నంద్యాల(అర్బన్): కేంద్రం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. పులిమద్ది గ్రామంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ సుగుణశ్రీ,ఏఓ ప్రసాదరావు సర్పంచ్ రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు నివాళి


నంద్యాలలో నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

నంద్యాల(న్యూటౌన్): నవభారత నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బొమ్మల సత్రం కూడలిలోనున్న ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుధవారం సీపీఐ, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని కోరారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ హక్కులతో సమస్యలను పరిష్కరించుకుందామని ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ .జిల్లా ప్రదాన కార్యదర్శి నిర్మలమ్మ, సీఐటీయూ కార్యదర్శి నాగరాజు అన్నారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిఘలర్పించారు. అనంతరం నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ఉయ్యాలవాడ : రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఓబులేస్ కోరారు. బుధవారం మండలంలోని బోడెమ్మనూరు ప్రాథమిక పాఠశాలలో అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నంద్యాల(అర్బన్)/(వ్యవసాయం): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతలమోహన్‌రావు అన్నారు. అంబేడ్కర్ 67వ వర్ధంతి సందర్భంగా బుధవారం బొమ్మల సత్రం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడుబోయ పులికొండన్న సంఘం నాయకులతో కలిసి విగ్రహానికి పూలమాల వేశారు. దళిత సంఘం నేత మేకల లింగస్వామి ఆధ్వర్యంలో దళిత సంఘం, మాలమహానాడు, ఎమ్మార్పీస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే.. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రుద్రవరం: మండలంలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన చిన్నవీరయ్య (25) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి బుధవారం తెలిపారు. తల్లిదండ్రులు మందలించడంతో పురుగుల మందు సేవించడంతో చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఓ వైద్యశాలలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

కేసు నమోదు

రుద్రవరం: మండలంలోని ఎర్రగుడిదిన్నె గ్రామానికి చెందిన ప్రతాపరెడ్డి అనే వ్యక్తి తెలుగుగంగ కాల్వను ధ్వంసం చేసినందుకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి బుధవారం తెలిపారు. 12వ కి.మీ. వద్ద కాలువను ధ్వంసం చేసి పొలాల్లో దారిని ఏర్పాటు చేసుకున్నాడని, టీజీపీ సహాయ కార్యనిర్వహణాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.